

ఉష్ణోగ్రత : గరిష్టం 36.0 కనిష్టం 15.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:31
(బుధవారం సాయంత్రం)
సహర్: 5:04 (గురువారం ఉదయం)



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం

భారీగా తరలివచ్చిన భక్తజనం

కడ్తాల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కడ్తాల మండలం రావిచేడ్ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఎన్‌బీసీమాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. మహిళలు తలంబ్రాలతో కల్యాణంలో పాల్గొన్నారు. ప్రముఖ వేదపండితుడు తిరుమల వింజమూరి రామానుజాచార్యుల పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్త పుట్టపాగ రామచందర్ రావు, ఆధ్వర్యంలో ఆర్చకులు ఆచార్య ఆదిత్య, చిదంబర శర్మ వేదమంత్రాలు, బాజా భజంత్రీల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాట గీతానర్సింహ, భాస్కర్ రెడ్డి, యాదిలాల్, లక్ష్మణశర్మ, బొప్పిడి గోపాల్, మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, డాక్టర్ శ్రీనివాస్, రంగయ్య, జనార్దన్‌గౌడ్, బాలకృష్ణ, రమేశ్ గౌడ్, భారతమ్మ, దశరథ్ నాయక్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, గంప వెంకటేశ్, పరమేశ్, బీక్యనాయక్, భీచ్యనాయక్, మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, వీరయ్య, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



కల్యాణ తంతును వీక్షిస్తున్న భక్తులు

అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు



నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలపై జిల్లా ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు. సమస్యలపై ఎమ్మెల్యేలు గళం విప్పేనా అని కుతూహలంతో ఎదురుచూస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలు అనేకం పెండింగ్‌లోనే ఉండగా ఆయా నియోజకవర్గాల్లో సమస్యలు తిష్టవేశాయి. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు ఈ సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చి పరిష్కారమయ్యేనా అని ఎదురు చూస్తున్నారు. అధికార, విపక్ష సభ్యులు అస్త్రశస్త్రాలతో అసెంబ్లీకి హాజరు కానున్నారు. మన శాసన సభ్యులు జిల్లా గురించి ఏం మాట్లాడుతారనే ఉత్కంఠ అందరిలో నెలకొంది. ఈ సమావేశాల్లో ఏ అంశాలను ప్రస్తావిస్తారని జిల్లా ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఎమ్మెల్యేలు సమస్యలపై గళమెత్తేనా?
పెండింగ్ పనులు చర్చకు వచ్చేనా?
ఆశగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రజలకిచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదు. వైఎస్సార్ ప్రభుత్వంలో టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో చేవెళ్లలో టీటీడీ కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి శంకుస్థాపన చేశారు. కల్యాణ మండప నిర్మాణానికి చేవెళ్ల ప్రజలు కావడి తిరుపతిరెడ్డి, కనక మామిడి శివశంకర్‌రెడ్డి, సామ రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి కలిసి రూ.40 లక్షలు విరాళం ఇచ్చారు. నేటికి కల్యాణ మండప నిర్మాణం జరగలేదు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 2012 డిసెంబర్ 9న చేవెళ్లలో ఆర్టీసీ డిపోకు శంకుస్థాపన చేశారు. దీనిపై ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేరలేదు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఇచ్చిన హామీ అలాగే ఉండిపోయింది. మూడేళ్ల నుంచి ఆస్పత్రి నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరైనట్లు పలుమార్లు ప్రకటించిన ఎమ్మెల్యే దాని గురించి పట్టించుకోవడం లేదు. 84 గ్రామాల అభివృద్ధికి గుదిబండగా మారిన జీవో 111 గురించి ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతోపాటు బస్సు డిపో ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. శంకర్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు చేసిన ప్రకటనను విస్మరించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాళాశాల ఏర్పాటుపై ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో శంకర్‌పల్లి ప్రజలు విమర్శిస్తున్నారు. షాబాద్ ప్రభుత్వ ఆసుత్రిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తానని ఇచ్చిన హామీ అలాగే ఉండిపోయింది. ప్రధానంగా హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులకు మోక్షం కలగడం లేదు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. 920 కోట్లు మంజూరయ్యాయి. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి శంకుస్థాపన

మిగతా 8వ పేజీలో...

నీళ్లు రాలే.. రోడ్డు పూర్తి కాలే



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కృష్ణా నీటిని సాగు నీరుగా తీసుకువస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అది ఎప్పటికి నెరవేరుతుందోనని రైతాంగం ఎదురు చూస్తోంది. బీఆర్ఎస్ హయాంలో డిండి నుంచి శివన్నగూడ వరకు నీటిని తరలించి అక్కడ నుంచి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గానికి సాగు నీరు తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నంకూడా ఫలించలేదు. అంతేగాక ఇబ్రహీంపట్నం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేదు. నాగార్జునసాగర్ ప్రధాన రహదారి శేరిగూడ శ్రీ ఇందూ ఇంజినీరింగ్ కళశాల వద్ద రూ.3.6 కోట్లతో స్పాన్ మైనర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా అది ఓ వైపునే పూర్తయింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల చేయకపోవడంతో మరో వైపు పనులు మొదలు పెట్టలేదు. ఈ బ్రిడ్జి అంచనా వ్యయం రూ.5.4 కోట్లకు చేరింది. ఈ బ్రిడ్జి రెండో వైపు పనలు ఎప్పుడు పూర్తి చేస్తారా అని జనం ఎదురు చూస్తున్నారు.

సమస్యలపై ప్రస్తావిస్తా..



విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులు బిల్లుల కోసం నానా అవస్థలు పడుతున్నారు. బిల్లులు అందక రోడ్లపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్నారు. సీజన్ ఉన్నప్పుడు విజయ డెయిరీకి, లేనప్పుడు ప్రైవేట్ డెయిరీలకు పాలను విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల విజయ డెయిరీ నష్టపోతుంది. ప్రైవేట్, ప్రభుత్వం అనేది లేకుండా డెయిరీని క్లస్టర్‌గా మార్చాలి. ఈ అంశాన్ని ప్రస్తావిస్తాను. అలాగే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు కోసం అసెంబ్లీలో మాట్లాడతాను.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్



మాట్లాడుతున్న సాంబశివరావు

కార్పొరేట్లకు దోచిపెడుతున్న
మోదీ సర్కార్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

మహేశ్వరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్న మోదీ సర్కార్ తీరును ప్రజలు గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా ఇదే తీరును కనబరుస్తుందని ఆరోపించారు. తుక్కుగూడలో మంగళవారం జరిగిన సీపీఐ జిల్లా స్థాయి సెమినార్‌కు హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆర్థిక పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారుల మీద దాడులు పెరిగాయని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, నాయకులు రవీంద్రాచారి, పుస్తకాల నర్సింగ్‌రావు, పర్వతాలు, యాదిరెడ్డి, రామస్వామి, దత్తు నాయక్, నర్సింహ, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, నీలమ్మ, రామకృష్ణ, ప్రభులింగం పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

» శంషాబాద్ డీసీపీ రాజేశ్



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ కోరారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ చేసి పరిష్కరించేలా చూడాలన్నారు. ఆమనగల్లు పోలీసు స్టేషన్‌ను మంగళవారం శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులను, పరిసరాలను, స్టేషన్ వెనుకభాగంలో నిర్మిస్తున్న ప్రహరీ, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వాహణలో అలసత్వానికి తావివ్వొద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారామ్ రెడ్డి, ఏఎస్ఐ బాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం
చేసుకోవాలి
చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
మహిళల మెగా జాబ్‌మేళాకు
విశేష స్పందన
8

గిరిజన హక్కుల రక్షణకు
కమిషన్ కృషి
జాతీయ ఎస్టీ కమిషన్
సభ్యుడు హుస్సేన్ నాయక్
7

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

సింబియాసిస్ యూనివర్సిటీలో ఘటన

రంగారెడ్డి అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింబియాసిస్ యూనివర్సిటీలో విద్యార్థి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన షగ్నిక్ బసు(21) నందిగామ సింబియాసిస్ యూనివర్సిటీలో హాస్టల్‌లో ఉంటూ బీఏ ఎల్‌ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యరాత్రి బాత్రూంకి వెళ్లిన షగ్నిక్ బసు చాలా సేపటివరకు బయటకు రాలేదు. దీంతో తోటి రూంమేట్స్ డోర్ కొట్టినా తీయకపోవడంతో వెంటిలేటర్ నుంచి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. వెంటనే విద్యార్థులు కళాశాల సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో డోర్ పగలగొట్టి బయటికి తీసి చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. షగ్నిక్ బసు తండ్రి పార్థబసు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని వెద్యులు, పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు కళాశాల ఎదుట ఆందోళన చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



షగ్నిక్ బసు(ఫైల్)



తిమ్మాపూర్ వద్ద ప్రమాదకరంగా అండర్‌పాస్ రోడ్డు

డేంజర్‌పాస్‌లు

ప్రమాదకరంగా అండర్ పాస్ రోడ్లు

పత్తాలేని సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు.. ఆందోళనలో వాహనదారులు

కొత్తూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం వేసిన అండర్‌పాస్ రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వే అండర్‌పాస్, మండల కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన జాతీయ రహదారి అండర్‌పాస్ వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తిమ్మాపూర్ జాతీయ రహదారి నుంచి గుడూర్, చేగూర్ గ్రామాలకు వెళ్లే వారి కోసం తిమ్మాపూర్ సమీపంలో వై ఆకారంలో రైల్వే అండర్‌పాస్ నిర్మించారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇదేంది 'వై'

తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలతోపాటు చేగూర్ శివారులో కన్హాశాంతి వనం ఉన్నాయి. శంషాబాద్, షాబాద్ మండలాల్లోని ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనచోదకులు అండర్‌పాస్ నుంచి వెళ్తుంటారు. దీంతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. అండర్‌పాస్ చుట్టుపక్కల వ్యవసాయ భూములు ఉండడంతో రైతుల రాకపోకలు అధికంగా ఉంటాయి. కొత్తూర్ సమీపంలో జాతీయ రహదారి ఆధ్వర్యంలో అండర్‌పాస్ నిర్మించారు. ఇక్కడ కూడా వై ఆకారంలో అండర్‌పాస్ నిర్మించారు. హైదరాబాద్ షాద్‌నగర్ వైపు, మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే వారి కోసం వై ఆకారంలో అండర్‌పాస్ నిర్మించారు. జాతీయ రహదారి వై జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు సంభవిస్తుండడంతో ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మించి భద్రతా ఏర్పాట్లు మరిచారు. సూచికలు, రేడియం లైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాల రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అండర్ పాస్‌కు అటు, ఇటు ఇళ్లు ఉండడంతో బాటసారులు కూడా అండర్‌పాస్ నుంచి వెళ్తుంటారు. సంబంధిత అధికారులు గుర్తించి అండర్‌పాస్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్లపై ప్రమాదాల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొత్తూరు వద్ద అండర్‌పాస్ ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించాలి. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

- నరేశ్‌చారి, ఏబీవీపీ మండల కన్వీనర్, కొత్తూర్

ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి



తిమ్మాపూర్ అండర్‌పాస్ వద్ద భారీ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నాం. వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించడం లేదు. స్పీడ్‌ను తగ్గించేందుకు రంబుల్‌స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి. రేడియంతో కూడిన సూచికలు, మిర్రర్లు ఏర్పాటు చేయాలి.

- చిర్ర మధుసూదన్‌రావ్, న్యాయవాది, మల్లాపూర్

బడి గంటకు లేట్!

సమయానికి రాని ఆర్టీసీ బస్సులు

» సవ్యంగా సాగని చదువులు
» ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'నువ్వు వెళ్లాల్సిన ట్రైను జీవితకాలం లేటు' అన్నట్లు సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ఉన్నత పాఠశాలలో పరిసర గ్రామాల విద్యార్థులు చదువుతున్నారు. బాలానగర్ మండలంలోని సూరారం, గంగదార్‌పల్లి, రామేశ్వరం, వాటి పరిధిలోని తండాల నుంచి చాలా మంది విద్యార్థులు వస్తుంటారు. షాద్‌నగర్ డిపో నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరిన బస్సు ఆయా గ్రామాల నుంచి 7 గంటల వరకు రాయికల్‌కు చేరుకుంటుంది. రెండో బస్సు అన్ని గ్రామాలు తిరిగి 10 గంటలకు రాయికల్‌కు వస్తుంది. దీంతో పాఠశాలకు విద్యార్థులు గంట ఆలస్యంగా చేరుకుంటున్నారు. అప్పటికే మొదటి పీరియడ్ అయిపోతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రాయికల్ గ్రామానికి ఉదయం 9 గంటల వరకు బస్సు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.



రాయికల్ ఉన్నత పాఠశాలకు ఆలస్యంగా వస్తున్న విద్యార్థులు

వేళకు బస్సు నడపాలి



ప్రతి రోజూ బస్సు ఆలస్యంగా రావడం వల్ల ఒక పీరియడ్ మిస్ అవుతున్నాం. దూరం నుంచి రావడం వల్ల సమయానికి పాఠశాలకు రాలేక పోతున్నాం. సమయానికి బస్సు నడపాలి.

- కార్తీక్, 9వ తరగతి, రాయికల్

అదనపు బస్సు వేయాలి



సమయానికి బస్సు రావడం లేదు. అదనపు బస్సు సర్వీసులు నడపాలి. లేకుంటే టైంకు బడికి రాలేం. పాఠశాలకు రోజూ గంట లేట్ అవుతుంది. దీంతో మొదటి పీరియడ్ నష్టం పోతున్నాం.

- సాత్విక, 6వ తరగతి, రాయికల్

ఎన్‌ఎఫ్‌సీ నగర్ మూడిళ్లలో చోరీ


బీరువాలోని వస్తువులను చిందరవందర చేసిన దుండగులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ చోరీలకు ఎగబడుతున్నారు. ఘట్‌కేసర్ మండల పరిధి ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో దొంగలు చోరీలు పాల్పడుతున్నారు. ఎన్‌ఎఫ్‌సీనగర్ లక్ష్మీనగర్‌లోని నందూరి పద్మావతి ఇంటి గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంగళవారం తెల్లవారుజామున దొంగలు తాళం పగులగొట్టి బీరువాలోని వస్తువులను చిందరవందర చేశారు. శబ్దం వినిపించగానే పై ఫ్లోర్‌లో ఉన్న పద్మావతి లైట్లు వేసింది. దీంతో దొంగలు పారిపోయారు. అలాగే ఎన్‌ఎఫ్‌సీనగర్ లక్ష్మీనగర్‌లో ఉంటున్న గుండు గిరి ఇంటితాళం వేసి సోమవారం బంధువుల పెళ్లికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చే సరికి ఇంట్లో దొంగతనం చేశారు. బీరువాలో ఉంచిన 3తులాల వెండి అభరణాలు ఎత్తుకపోయారు. అలాగే ఎన్‌ఎఫ్‌సీ నగర్ సి-2లో ఉంటున్న రైల్వే ఉద్యోగి విజయభాస్కర్‌రెడ్డి కుటుంబీకులు నెల్లురులోని బంధువుల ఇంటికి వెళ్లారు. విజయభాస్కర్‌రెడ్డి రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చే సరికి బీరువాలోని రెండు తులాల బంగారు, 2తులాల వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు చేరుకొని పరశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడవి పందుల బెడదను నివారించాలి


ధ్వంసమైన టమాట చేను

మంచాల, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆరుట్లలోని మొద్దు జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన పొలంలో అడవి పందులు సోమవారం రాత్రి టమాట తోట, ఇతర పంటచేలను ధ్వంసం చేశాయి. పాడైన పంటచేలను మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్, ఏఈవో లింగస్వామి, కంబాలపల్లి భాస్కర్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, వినోద్‌కుమార్, శ్రీనివాస్, భాస్కర్, రవీందర్ పరిశీలించారు. వారితో బాధిత రైతు మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో సమీపంలోని అటవీప్రాంతం నుంచి అడవిపందులు గుంపులుగా వచ్చి తోటలను పాడుచేస్తున్నాయని వాపోయారు. ప్రభుత్వం సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రభు త్వం సబ్సిడీపై పరికరాలు మంజూరు చేయాలని కోరారు.

కేజీరెడ్డి కళాశాలలో ముగిసిన హ్యాక్‌స్టార్మ్-2025

మొయినాబాద్ రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, అభ్యసనంతో విద్యార్థులు ముందుకు సాగాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి అన్నారు. కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్సీ)-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్(ఏఐ,ఎంఎల్) విభాగం హ్యాక్‌స్టార్మ్-2025 కార్యక్రమం మంగళవారం ముగిసింది. మొత్తం 28 బృందాలు హ్యాక్‌థాన్‌లో పాల్గొన్నాయి. ప్రొఫెసర్ రాంబాబు, ఆదర్శ్‌కొండ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ఇండియా క్రికెట్ టీం
ఫీల్డింగ్ కోచ్‌కు ఘనస్వాగతం


దిలీప్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

శంషాబాద్ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ చాంపియన్స్ ట్రోఫి గెల్చుకున్న భారత క్రికెట్ జట్టు మంగళవారం వారివారి స్వస్థలాలకు వెళ్లారు. అయితే ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌కుమార్ దుబాయ్ నుంచి నేరుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. విమానాశ్రయంలో క్రికెట్ అభిమానులు కట్ట వెంకటేష్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, నర్సింహా ముదిరాజ్, ప్రభాకర్, వెంకటేష్‌యాదవ్, సాయి ముదిరాజ్, ఉమేష్‌యాదవ్ అతనికి శాలువలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫి గెల్చుకోవడంతో ఫీల్డింగ్ కోచ్ పాత్ర ఎంతో ఉందని అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. భారత క్రికెట్ జుట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన దిలీప్‌కుమార్‌కు ప్రభుత్వం తరుపున ఎవరు వెల్కమ్ చేప్పకపోవడం దురదృష్టకమన్నారు. ఫీల్డింగ్ కోచ్‌గా మన తెలంగాణ బిడ్డా కావడం దేశానికి గర్వ కారణమని కట్ట వెంకటేష్‌గౌడ్ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో తాగునీటి కష్టాలు


బొంగ్లూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కమిషనర్ బాలకృష్ణ

ఆదిభట్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బొంగ్లూర్ మోడల్ స్కూల్‌లో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోడల్ స్కూల్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 300 మంది విద్యార్థులున్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్ నీరు రాక విద్యార్థులు డబ్బులు పోగు చేసుకుని 20లీటర్ల వాటర్‌క్యాన్లు కొంటున్నారు. గతంలో కలెక్టర్ నారాయణరెడ్డి మోడల్ స్కూల్‌ను సందర్శించి వాటర్ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మోడల్ స్కూల్‌ను కమిషనర్ బాలకృష్ణ సందర్శించారు. సమస్యను రెండు రోజులో పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ స్వరన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి రూ.3లక్షలు మంజూరు

బొంగ్లూర్ మోడల్ స్కూల్‌లో తాగు నీటికి కలెక్టర్ నారాయణరెడ్డి రూ.3లక్షలు మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులకు వసతులు లేకుండా ఇబ్బందులు పడకూడదన్నారు.తాగునీటి కోసం అధికారులు బోర్ వేయించాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో బోరు డ్రిల్లింగ్‌ను బుధవారం సాయంత్రం లోపు పూర్తిచేయాలని ఆదేశించారు.

సర్కార్ నిర్ణయం మార్చుకోకుంటే ఉద్యమం


మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్

కడ్తాల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ ఏకపక్ష, అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది పడుతున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో ఏర్పాటు చేస్తున్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలుపాలని డిమాండ్ చేశారు. కడ్తాలలో మంగళవారం దశరథ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డిలో కలిపిన ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలను కలిపి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడ్తాల మండలంలోని కొన్ని గ్రామాలను కార్పొరేషన్‌లో కలిపి మిగతాగ్రామాలను కలపకోవడం సరికాదన్నారు. సర్కార్ నిర్ణయం మార్చుకోకుంటే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం అన్నారు. అనంతరం మైసిగండి మైసమ్మ ఆలయానికి వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు దశరథ్, నాయకులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో మాజీ వైస్‌ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, రామకృష్ణ, తుల సీరామ్, హరిచంద్, లోకేశ్, నర్సింహాగౌడ్, పంతూనాయక్, రమేశ్, సాయిలు, నర్సింహ, పాండు, రామచంద్రయ్య, మహేశ్, బాబా, శ్రీకాంత్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆశీస్సులతో అభివృద్ధి చెందాలి


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆశీస్సులతో గ్రామం అభివృద్ధి చెందాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇన్ముల్‌నర్వలోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే హాజరై నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను భారీగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కల్గుతుందన్నారు. ఎమ్మెల్యేను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ శోభలింగంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, ప్రేమ్‌నాయక్ పాల్గొన్నారు. కాగా ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచులు మిట్టునాయక్, అజయ్‌నాయక్, నాయకులు శ్రీనివాస్, గోపాల్‌నాయక్, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శివాచారి, గణేష్, రవి, మహేష్, సాగర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జైన్

కొడంగల్ రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని హుసేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకులు జైన్, డైట్ (డీఎడ్) ఫీల్డ్ పరిశీలకురాలు మమత సందర్శించారు. ఈ సందర్భంగా రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ చేపట్టిన అధ్యాయనం ప్రారంభమైనట్లు వారు తెలిపారు. సర్వేలో భాగంగా మంగళవారం పాఠశాలలో గణితం శాస్త్రంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. జిల్లాలో ఎంపిక చేసిన 50 ప్రభుత్వ పాఠశాలల్లో మూడు రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుందని తెలిపారు. కొడంగల్ మండలంలోని హుసేన్‌పూర్, బుల్కాపూర్, గుండ్లకుంట, అంగడిరైచూర్ ఉర్దూ మీడియం, చిట్లపల్లి తండా ప్రాథమిక పాఠశాలలతోపాటు హస్నాబాద్ ప్రాథమికోన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే కొనసాగుతుందని తెలిపారు. బుధవారం ఆంగ్లంలో విద్యార్థుల సామర్థ్యాలపై పరిశీలనతో సర్వే ముగుస్తుందని తెలిపారు.

గ్రంథాలయ నిర్మాణంలో నాణ్యత పాటించాలి


భవనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనంలో నాణ్యతను పాటించాలని, నాణ్యత లోపిస్తే చర్యలను తప్పవని కాంట్రాక్టర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగనూరు శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శామీర్పేట్ మండలంలోని అలియాబాద్ గ్రామంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని మంగళవారం మేడ్చల్ ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్‌తో కలిసి పరిశీలించారు. సాధ్యమైనంత తొందరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తుల్జాభవానీ పూజలు

కులకచర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకుల తండాలో మంగళవారం తుల్జాభవానీ మాత పూజలు నిర్వహించారు. రెండేళ్లకోసారి తండాలో చేసుకునే పెద్ద పండగ ఇది. తుల్జాభవానీ మాతకు మేక పోతులతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. తుల్జభవానీ మాతను గిరిజనులు ఊరేగించి పూజలు నిర్వహించారు.



మహిళా సాధికారతకు చేయూతనివ్వాలి



శంకర్‌పల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి):మహిళా సాధికారికతకు ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని గ్రాన్యూల్ లిమిటెడ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ఉమ తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. వ్యాపార ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లను ఆమె గుర్తు చేసుకున్నారు. యువత జీవితంలోని ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని అన్ని రంగాల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ చైర్‌పర్సన్ శోభారాణి యశస్వి, రిజిస్ట్రార్ విజయలక్ష్మి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ఎస్. గణేష్, జాయింట్ వి. మధుసూదన్‌రావు ఉన్నారు.

గ్రూపు-2లో రాఘవేందర్‌కు 26వ ర్యాంకు



కులకచర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రూపు-2 ఫలితాల్లో తిరుమలాపూర్ వాసి బల్ల రాఘవేందర్‌గౌడ్ రాష్ట్రస్థాయిలో 26వ ర్యాంక్ సాధించాడు. రవీందర్‌గౌడ్, విద్యావతిల కుమారుడు రాఘవేందర్ గౌడ్ దోమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ఉమ్మడి రంగారెడ్డి ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఐఐటీ రాజస్థాన్‌లో చేశారు. ప్రస్తుతం కేరళలో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. గ్రూపు-2 ర్యాంక్ సాధించారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డీబీ.శీతల్

తప్పుదారి పడుతున్న యువత

వికారాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యువతలో కొందరు తప్పుడు దారుల్లో వెళ్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ డీబీ.శీతల్ పేర్కొన్నారు. మంగళవారం తక్షశీల డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ. మాదకద్రవ్యాల వినియోగం, దానికి తగిన నష్టం, సమాజానికి కలిపే హానిని గురించి విద్యార్థులకు వివరించారు. యువత మాదకద్రవ్యాల వినియోగం నుండి ఎలా దూరంగా ఉండాలో, అలాగే చట్టాలను అవగాహన చేసుకుని సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మెలగడం ఎంత అవసరమో వివరించారు. వాహనాలు నడిపే యువకులు చట్టంలోని నిబంధనలు తప్పక పాటించాల్సిన అవసరం ఉందని ర్యాంగింగ్‌పై కూడా చట్టాలు ఉన్నాయని అవి కఠినమైన శిక్షలను అమలు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. వెంకటేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ బోధన సిబ్బంది పాల్గొన్నారు.


కేసు వివరాలను చూపుతున్న అనంతరెడ్డి

పంచాయతీలను హెచ్‌ఎండీఏలో కలపొద్దు

శంషాబాద్ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం చిన్న గోల్కొండ, పెద్ద గొల్కొండ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, ఘన్సిమియాగూడ, శంకరపురం పంచాయతీలను హెచ్‌ఎండీఏలో కలపొద్దని సుప్రీంకోర్టును ఆశ్రయించామని చిన్నగోల్కొండ మాజీ సర్పంచ్ గుర్రం పద్మావతి భర్త అనంతరెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం హెచ్‌ఎండీఏలో విలీనాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించామన్నారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలను హెచ్‌ఎండీఏలో కలిపామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపిందన్నారు. అయితే తాము సుప్రీంకోర్టుకు వెళ్లామన్నారు. సుప్రీంకోర్టు రెండు వారాల గడువు కోరిందన్నారు. జీవో 111తో వెనకబడిన గ్రామాలను హెచ్‌ఎండీలో కలపడం దృష్టికరమన్నారు. మండల పరిధి ఆరు పంచాయతీల అభిప్రాయం తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా హెచ్‌ఎండీలో కలిపిందని, గ్రామాల్లోని పేదలు ప్రజలు ట్యాక్స్‌లు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. హెచ్‌ఎండీఏలో కలిపితే జీవో 111ను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్‌లు లక్షల రుపాయలు పెట్టి అభివృద్ధి పనులు చేసినా బిల్లులు రాలేదన్నారు. 111జీవో కారణంగా రైతులు తమ అవసరాలకు భూమి అమ్ముకునే వీల్లేకుండా పోయిందని అవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఆరు పంచాయతీలనే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీలో విలీనం కాకుండా పోరాటం చేస్తామని ఆయన అన్నారు.


వెంచర్ గేట్‌ను తొలగిస్తున్న అధికారులు

పొలాల్లోకి పోకుండా వెంచర్‌కు గేట్!

» చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

మేడ్చల్ టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన్‌కల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన వెంచర్ గేటును అధికారులు మంగళవారం తొలగించారు. నూతన్‌కల్ పరిధి సర్వే నంబర్ 653, 672, 681, 682. 663లలో 150 ఎకరాల్లో ఓ వెంచర్ నిర్వాహకులు ఫామ్ ల్యాండ్ పేరిట ప్రహరీని ఏర్పాటు చేశారు. వెంచర్‌కు ముఖ ద్వారా గేట్‌ను ఏర్పాటు చేశారు. వెంచర్ పరిసరాల్లోని కొందరు రైతులు తమ పొలాల వెళ్లేందుకు దారి లేకుండా చేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నూతన్‌కల్ పంచాయతీ కార్యదర్శి వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. వెంచర్ నిర్వాహకులు స్పందించకపోవటంతో మంగళవారం ఎంపీడీవో సునీత, నూతన్కల్, శ్రీరంగవరం, కొనాయిపల్లి కార్యదర్శి పంచాయతీ కార్యదర్శులు ఉమాదేశి, రమణారెడ్డి, ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో ఎక్స్‌కవర్లతో వెంచర్ గేటును కూల్చారు. వెంచర్ పరిసరాల్లోని భూములను కొనేందుకు వెంచర్ నిర్వాహకులు కుట్రపూరితంగానే గేటును ఏర్పాటు చేశారని రైతులు ఆరోపించారు. అనుమతుల్లేకుండా 150ఎకరాలకు పైబడి ఉన్న స్థలంలో ప్రహరీ ఏర్పాటు చేయటంతో వెంచర్ లోపల పొలాలున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్ చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహేందర్‌యాదవ్

కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

» ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసిన శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీ

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఆలయ నూతన కమిటీ ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరింది. పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీని ఇటీవల ఎన్నిక చేశారు. మంగళవారం కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీ చైర్మన్ మహేందర్‌యాదవ్, కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డిని సన్మానించారు. అలాగే ఆలయ కమిటీ నూతన చైర్మన్ మహేందర్‌యాదవ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి చేయూతనందించాలని ఆలయ కమిటీ ఎమ్మెల్యేను కోరింది. ఎమ్మెల్యే స్పందిస్తూ కట్టమైస్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు
పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

చక్రతీర్థంతో లక్ష్మీనరసింహస్వామి

ఉత్సవాల ముగింపు

కేశంపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భైర్ఖాన్ పల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు చక్రతీర్థంతో ముగిసాయి. గత వారం రోజులుగా లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు గ్రామంలో వైభవంగా కొనసాగాయి. చివరి రోజు మంగళవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, మేలతాళాల మధ్య గ్రామ పురవీదుల గుండా పల్లకి సేవా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కీర్తిస్తూ భక్తిపాటలు పాడారు. ఊరేగింపుగా దేవాతామూర్తులను బావి దగ్గరకు తీసుకెళ్లి పండితుల మంత్రోచ్చరణల మధ్య గంగస్నానం(చక్రతీర్థం) చేయించి ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో యాదగిరిచారి, రూప్లానాయక్, గుండెగొళ్ల అంజయ్య, కృష్ణయ్య ద్రోణాచారి, పిల్లి కుమార్, వెంకటేష్, యాదగిరి, అఖిల్, రాఘు, రమేష్, జగదీశ్వర చారి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకంగా కర్బూజ సాగు



కొడంగల్ రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో కర్బూజకు డిమాండ్ ఉండడంతో రెండేళ్లుగా కొడంగల్ మండలం హస్నాబాద్‌లో కర్బూజ సాగుచేస్తున్నారు. దేవరకద్ర మండలం చింతకుంటకు చెందిన కేశవులు, శేఖర్ మరో ఇద్దరు హస్నాబాద్‌లో ఐదెకరాల్లో తర్బూజ సాగుచేశారు. తర్బూజ పండ్లను సంతలో విక్రయించి లాభాలను పొందుతున్నట్లు తెలిపారు. కర్బూజ సాగుచేస్తే తక్కువ సమయంలో పంట చేతికొస్తుందని వారు తెలిపారు.

పీఎం శ్రీ పథకాన్ని రద్దు చేయాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత డిమాండ్ చేశారు. మంగళవారం డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు బేబి, సహాయ కార్యదర్శి బాలమణి, తదితరులు ఉన్నారు.


రేగొండి పాఠశాల

విద్యార్థులు 14.. టీచర్లు ఇద్దరు

హాజరు కేవలం ఐదుగురే

» పడిపోతున్న విద్యార్థుల సంఖ్య

» ప్రభుత్వ స్కూళ్లపై తగ్గుతున్న ఆసక్తి


హాజరైన ఐదురుగు విద్యార్థులు

పెద్దేముల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సరిగా లేదని తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని రేగొండి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను చూస్తే ఇదే నిజమనిస్తోంది. గతంలో ఇక్కడ 60మంది విద్యార్థులు ఉండేవారు. రాను రాను విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ప్రస్తుతం 14 మంది విద్యార్థులున్నారు. ఒకటో తరగతిలో ఇద్దరు, 2లో ఇద్దరు, 3లో ఇద్దరు, 4లో ఇద్దరు 5వ తరగతిలో ఆర్గురు చొప్పున ఉన్నారు. కాగా మంగళవారం ఐదుగురే హాజరయ్యారు. ఇక్కడ ఇద్దరు టీచర్లు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఆసక్తి సన్నగిల్లుతున్నా టీచర్లలో బాధ్యత పెరుగుతున్నట్లు కన్పించడం లేదు. వచ్చామా... వెళ్లామా.. అన్న చందంగా వారి వ్యవహార శైలి ఉంది. ఇద్దరు టీచర్లున్నా తగిన సంఖ్యలో విద్యార్థులు లేక పోవడం ఆలోచింపజేస్తోంది. గ్రామంలో ప్రైమరీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పదుల సంఖ్యలో ఉన్నా ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. సర్కారు బడిలో బోధన బాగుండదనే తల్లిదండ్రులు ఖర్చులు భరిస్తూ ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన బాగుంటే ప్రైవేట్ పాఠశాలలకు పంపే అవసరం ఉండదు. కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఫలితాలు వస్తున్నా చాలాచోట్ల మెరుగైన ఫలితాలు రావడం లేదు. ఇందుకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణం అని తల్లితండ్రులు అంటున్నారు.


మేడిపల్లిలో కోళ్లఫాంను
పరిశీలిస్తున్న అధికారి డాక్టర్ రేఖ

కోళ్లు చనిపోతే సమాచారమివ్వాలి

యాచారం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యాచారం మండల పరిధిలోని కోళ్లఫాంలలో కోళ్లు చనిపోతే తక్షణమే సమాచారమివ్వాలని పశుసంవర్ధక శాఖ మండల అధికారి డాక్టర్ రేఖ కోళ్ల ఫాంల నిర్వాహకులను కోరారు. మంగళవారం మండలంలోని నందివనపర్తి, యాచారం తదితర గ్రామాల్లో కోళ్ల ఫాంలను తనిఖీ చేశారు. చనిపోయిన కోళ్లను పెద్ద గోతి తీసి పాతిపెట్టాలని సూచించారు. చనిపోయిన కోళ్లను ఆరుబయట పడేయరాదన్నారు. మండలంలో ఏ ఒక్క గ్రామంలో బర్డ్‌ఫ్లూ సోకలేదని పేర్కొన్నారు. కోళ్ల షెడ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు లక్షల లేయర్ కోళ్లతోపాటు 40వేల బాయిలర్ కోళ్లున్నాయని తెలిపారు. కోళ్లు చనిపోతే సమాచారమందించాలని కోరారు.

గిరిజన హక్కుల రక్షణకు కమిషన్ కృషి

ఆమనగల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగల హక్కులు, ప్రయోజనాలు, చట్టాల పరిరక్షణకు జాతీయ ఎస్టీ కమిషన్ కృషి చేస్తోందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ తెలిపారు. ఆమనగల్లులో మంగళవారం ఆయన పర్యటించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న హుస్సేన్‌నాయక్‌కు జాతీయ బీసీ బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి స్వాగతం పలికారు. ఆచారి నివాసంలో ఆయన గిరిజనులతో సమావేశమయ్యారు. వారి వినతులను స్వీకరించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరుతో భూములను లాక్కునేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని గిరిజనులు చెప్పారు. గిరిజన హక్కుల పరిరక్షణకు కమిషన్ కృషిచేస్తోందని హుస్సేన్ చెప్పారు. గిరిజనుల హక్కులను ఎవరు హరించినా ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు చెక్కాల లక్ష్మణ్, రవిరాథోడ్, ఆనంద్, బాలు, నరేందర్, భాస్కర్, జయరామ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న తల్లోజు ఆచారి, బీజేపీ నాయకులు

అంబలి కేంద్రాన్ని సందర్శించిన హుస్సేన్

కడ్తాల్: కడ్తాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి కేంద్రాన్ని హుస్సేన్ నాయక్ సందర్శించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, నాయకులతో కలిసి ప్రజలకు అంబలి పంపిణీచేశారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్ సభ్యులను అభినందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు భగీరథ్, రాందాస్‌నాయక్, శంకర్ నాయక్, రెడ్యా, సాయిలాల్, మన్యనాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పథకాలను గిరినులు సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు: గిరిజనులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, రాష్ట్ర గిరిజిన మోర్చా అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ కోరారు. మైసిగండికి వెళ్తున్న కందుకూరులో బీజేపీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలం నాయక్, భూంరెడ్డి, రఘునందన్, భాస్కర్, బాలునాయక్, గోపాల్, భాస్కర్, రాజు, భానుప్రకాశ్, కిరణ్, వినోద్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రామాలయంలో హుస్సేన్‌నాయక్ పూజలు

యాచారం: ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని తాను శ్రీరామచంద్రస్వామిని వేడుకున్నానని హుస్సేన్‌నాయక్ తెలిపారు. యాచారంలోని సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దేశాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, బీజేపీ నాయకులు బాషా, విజయ్‌నాయక్, రమేష్, శ్రీనాథ్, ప్రసాద్, వేణు, పాండు తదితరులు ఉన్నారు.


కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రగతి నిరోధకంగా విపక్షాలు

కడ్తాల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రగతిని ఓర్వలేక విపక్షాలు కుట్ర రాజకీయాలతో ప్రభుత్వంపై కుట్రపన్నుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రావిచెడ్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేస్తూ ప్రగతిని అడ్డుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కల్వకుర్తి నియోజకవర్గానికి మహర్దశ పట్టిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో శ్రీశైలం యాదవ్, సాయిగౌడ్, మహేశ్, వంశీ,పవన్, వినోద్ ఉన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు భారతమ్మవిఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, జనార్ధన్, షాబుద్దీన్, శ్రీశైలం, యాదగిరిరెడ్డి, రవి, అజీమ్, అంజయ్య పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆదేశాలు కదిలిన మున్సిపల్ అధికారులు


ఐబీ రోడ్డులో
వెలిగిన వీధీ దీపాలు

తాండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న ' ఆంధ్రజ్యోతి ' దినపత్రికలో 'బల్దియా.. మీ దయ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కదిలారు. ఇరిగేషన్ బంగ్లా రోడ్డులోని వీధి దీపాలకు మున్సిపల్ ఎలక్ట్రిషన్ విభాగం సిబ్బంది మరమ్మత్తులు చేపట్టి లైట్లు వెలిగించారు. తరుచు మరమ్మత్తులు కాకుండా చూడాలని కాలనీ వాసులు సిబ్బందికి సూచించారు. వృధాగా పోతున్న నీటిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎండకాలం సమయంల ఓ నీటిని వృధా పొనియకుండా చూడాలని ఈ విషయంలో సిరియస్ వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.


ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న చెఫ్ దివ్యసారిక

అంతర్జాతీయ పోటీల్లో

మేడ్చల్ చెఫ్‌కు బంగారు పతకాలు

మేడ్చల్ టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌కు చెందిన ఓ మహిళ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన క్యూలవరీ ఆర్ట్ చాలెంజ్ పోటీల్లో నాలుగు బంగారు, రెండు కాంస్య పతకాలను సాధించారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన 17వ ఎడిషన్ ఇండియన్ క్యూలివరీ ఆర్ట్ చాలెంజ్ పోటీల్లో పాల్గొన్న ఎంఎస్.దివ్య సారిక బేకరీ చెఫ్‌లో ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. దాదాపు 800 మంది చెఫ్‌లతో పోటీపడి లైవ్ డిస్‌ప్లే, లైవ్ ప్రజెంటేషన్, లైవ్ కుకింగ్ అంశాల్లోని 18 విభాగాల్లో దివ్యసారిక ప్రతిభ చాటి ఉత్తమ చెఫ్ అవార్డును అందుకున్నారు.

జర్నలిజాన్ని పునః నిర్వచించుకోవాలి

శంకర్‌పల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా విస్ఫోటం చెందుతున్న తరుణంలో జర్నలిజాన్ని పునర్ నిర్వచించుకోవాల్సి అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ అన్నారు. ప్రొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అమర్ మాట్లాడుతూ మార్పునకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజం విశిష్ట వృత్తి అన్నారు. రిపోర్టర్ల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలన్నారు. తాను జర్నలిజం వృత్తిలోకి వచ్చి 50ఏళ్లు అయిందన్నారు. నాటితో పోలిస్తే ఇప్పటి సాంకేతిక పరిజ్ఞానంతో నిమిషాల్లోనే వార్త ప్రజల్లోకి వెళ్తోందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, చాట్ జీపీటీ తదితర టెక్నాలజీని అందిపుచ్చుకొని నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే జిల్లాగా రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో టీయూడబ్ల్యూజే పోరాటం చేసిందని గుర్తుచేశారు. అప్పట్లో ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కొందరు తెలంగాణ ఉద్యమ వేదికలపై కన్పించొద్దని ఆదేశించారని గుర్తు చేశారు. ఉద్యమంలో పోరాటం చేస్తామని ఆయన తేల్చి చెప్పారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మీడియా సెల్ కన్వీనర్ కార్తీక్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, యూనియన్ కార్యవర్గ సభ్యుడు మాజిద్, నాయకులు సత్యనారాయణ, ఎస్.శేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, సలీం పాషా, యాదయ్య ఉన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా సలీం పాషా

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌పల్లికి చెందిన సలీం పాషా ఎంపికయ్యారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా మేకల సత్యనారాయణ ఎన్నికయ్యారు. విరహత్ అలీ వారి నియామక పత్రాలు అందజేశారు. సలీం పాషా టీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. సలీం పాషా మాట్లాడుతూ.. విలేకరుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం అక్రిడిటేషన్, ఆరోగ్య భద్రత కార్డులు, ఇళ్ల స్థలాల ఇవ్వాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న దేవులపల్లి అమర్

శాంతి భద్రతల పరిరక్షణకు

పకడ్బందీ చర్యలు



కడ్తాల్ సీఐ శివప్రసాద్

కడ్తాల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, చోరీల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కడ్తాల సీఐ శివప్రసాద్ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలను పంచుకున్నారు.

షూటౌట్

ప్రశ్న: శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు : ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకోవడం ద్వారా నేరాలు, వివాదాలు జరుగకముందే అక్కడికి చేరుకొని పరిస్థితి చక్కదిద్దుతున్నాం. స్టేషన్ పరిధిలోని 24 పంచాయతీల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించి సమాచారం అందుకుంటున్నాం.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్లాన్ ఏమిటి?

జ: ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో స్టాపర్స్, మూల మలుపులు, ప్రజలు రోడ్డు దాటే చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. రోడ్లపై అక్కడక్కడ గోతులను పూడ్చి వేయించాం.

ప్ర: దొంగతనాలను ఎలా అరికడుతున్నారు?

జ: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. వాహనాల తనిఖీ చేపడుతూ పాత నేరస్థులు, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాం. సీసీ కెమెరాలు ఏర్పాటును చేసుకోవాలని దుకాణాదారులు, వ్యాపారులకు సూచించాం.

ప్ర: రోడ్డు భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాం. రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్న 25 మందిపై, వాహనాలు నడుపుతున్న 15 మంది మైనర్లపై కేసులు నమోదు చేశాం. జనవరి నుంచి 15 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం.

ప్ర: మత్తు పదార్థాల నిరోధానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జ: ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పండుగలు, శుభకార్యాల సందర్భాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నాం. అదేవిధంగా యువత, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి వాటి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం.

అధ్యక్షా..!

(5వ పేజీ తరువాయి)

చేసి మూడేళ్లు దాటుతున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇటీవల ఆలూరు గేట్ వద్ద కూరగాయల రైతులపై లారీ దూసుకెళ్లిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందిన విషయం విధితమే. ఇలా ఏటా ఎంతో మందిని ఈ రోడ్డు బలితీసుకుంది. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలపై నిమ్మకున్న ఎమ్మెల్యే యాదయ్యపై నియోజకవర్గ ప్రజలు గుర్రుగా ఉన్నారు. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో తన గళాన్ని విప్పి సమస్యలు పరిష్కరిస్తారని చేవెళ్ల ప్రజలు ఆశిస్తున్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని చేవెళ్ల-ఆలూరు రోడ్డు

'కసిరెడ్డి'హామీలు అమలయ్యేనా?

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 కాల్వ పనులు పూర్తి చేయించి చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరందిస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చాడు. పనులు పూర్తి దశకు చేరుకున్నప్పటికీ.. ఆయట్టు వరకు సాగునీరు రాలేదు. కల్వకుర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మిస్తానని తెలిపారు. ఏడాది కాలంలో ఒక్క కొత్త బీటీ రోడ్డు కూడా నిర్మాణం ప్రారంభించనూ లేదు. కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మిస్తానని తెలిపిన నేటికీ అమలుకు నోచుకోలేదు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని తెలిపిన గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయించి ప్రజల ఇబ్బందులు తీరుస్తానని తెలిపినా నేటికీ ఒక్క కార్యాలయం కూడా ఏర్పాటు చేయలేదు. మైసిగండి ప్రాంతంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయిస్తానని తెలిపినా నేటికీ మంజూరు కాలేదు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆమనగల్లు పట్టణంలో వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రం (న్యాక్) ఏర్పాటు చేస్తామని తెలిపినా నేటికీ అమలు కాలేదు. రూ.185 కోట్లతో రోడ్డు మంజూరు చేసినా టెండర్ల ప్రక్రియ కాలేదు.

లక్ష్మీదేవిపల్లి ప్రజల కల

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటంతో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనసభలో ప్రస్తావించనున్నారా? లేదా? అన్న విషయంపై నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల కల లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వాయర్ నిర్మించి తీరుతామని అప్పటి శాసనసభపక్ష నేత తన పాదయాత్రలో భాగంగా లక్ష్మీదేవిపల్లి గ్రామాన్ని సందర్శించారు. తాము అధికారంలోకి వస్తే రిజర్వాయర్ నిర్మించి తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ఊసెత్తలేదు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్వోబీ సమస్యను తీర్చాలి

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద అసంపూర్తిగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై చర్చించి నిధులు కేటాయించాలని షాద్‌నగర్ పట్టణ ప్రజలు కోరుతున్నారు. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో కొత్తగా వెలసిన కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం లేకపోవడం వల్ల ఆయా కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని సమీపంలో చెరువుల్లోకి వదులుతున్నారు. దాంతో చెరువులు కలుషితమవుతున్నాయి. ఎన్నికలముందు షాద్‌నగర్ పట్టణాన్ని మురుగురహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈఅంశాలపై శాసనసభలో చర్చించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్ల విస్తరణ, ఆధునీకరణపై చర్చిస్తా



కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.500 కోట్లతో వివిధ పథకాల కింద మంజూరైన బీటీ రోడ్ల విస్తరణ, ఆధునీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. 35వేల ఎకరాలకు సాగునీరు అందించే కేఎల్ఐడీ 82 కాలువ అనుసంధానంగా చిన్న కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయించి నిర్ణీత ఆయకట్టుకు సాగునీరు అందించేలా కృషి చేస్తా.

- కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

చెరువు అభివృద్ధికి నిధులు రాబడతాం



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా. మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తాను. గ్రామాల్లో అనేక లింకు రోడ్లను విస్తరించడంతోపాటు పలు రోడ్లు రీబీటీ చేయాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీ స్థాయి పెంపు, వసతుల కల్పనకోసం అసెంబ్లీలో చర్చిస్తాను.

- మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

షాద్‌నగర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. మున్సిపాలిటీలోని 24వ వార్డులో 10 లక్షల మున్సిపాలిటీ సాధారణ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు చేపట్టి, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీ వేస్తున్న రోడ్లను అనుమతి లేకుండా తొవ్వి ధ్వంసం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, మాజీ కౌన్సిలర్లు నందీశ్వర్, రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, మోహన్, బస్వం, జమ్రుద్ ఖాన్, విజయ్‌కుమార్‌రెడ్డి, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ పట్ల అవగాహన అవసరం

కందుకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని వైఆర్జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింకు వర్కర్స్ స్కీమ్ ప్రాజెక్టు రంగారెడ్డి జిల్లా రిసోర్స్ పర్సన్ రాంరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మంగళవారం గుమ్మడవెల్లిలో అవగాహన సదస్సుతోపాటు ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 75మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్యాంపులో ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రఘు, లింక్ వర్కర్ రజిత, మాజీ సర్పంచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్లా వంశీచంద్ రెడ్డి

తలకొండపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచి ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వంశీచంద్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెరుమాల్ల లచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె కుమారుడు, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌ను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో వంశీచంద్‌రెడ్డి సమావేశమై ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శిమోహన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అంజయ్య, నాయకులు విజయ్‌కుమార్, బీక్యనాయక్, సునంద, రవీందర్ యాదవ్, డిగ్రీ కృష్ణ, రాములు, చెన్నకేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మాడ్గుల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లికి చెందిన పిట్టల బక్కమ్మ అనారోగ్యంలో మంగళవారం మృతిచెందింది. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రూ.3వేల ఆర్థిక సాయం అందించారు. ఆయనతో యాదయ్య, సోమయ్య, మల్లయ్య, మల్లారెడ్డిలు ఉన్నారు.


పరిశోధనలపై దృష్టి సారించాలి



విద్యార్థులతో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఏపీ ప్రతినిధులు

షాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఆకృతి ప్రాజెక్టు(ఏపీ) ఆధ్వర్యంలో షాబాద్ మండలం నుంచి తాళ్లపల్లి, షాబాద్ బాలికల, సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలు, మొయినాబాద్ మండలం నుంచి బాకారం, పెద్దమంగళారం, కేతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్ మెడల్స్‌ను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆకృతి ప్రాజెక్టు ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ ఎల్లేష్, తదితరులు

మంచాల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పటేల్‌చెర్వు తండాలో రూ.11 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మంగళవారం ప్రారంభించారు. గ్రామాల అభ్యున్నతికి నిధుల విడుదల చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, లక్ష్మన్‌నాయక్, రాజునాయక్, మార సురేష్, ధర్మానాయక్, చిందం బలయ్య, పాండాల శ్రీనివాస్, భాస్కర్, ఎండీ అక్కు, సీతారాంనాయక్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందిస్తున్న అందె బాబయ్య

రంగారెడ్డి అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప దేవాలయం పునర్నిర్మాణానికి తన వంతుగా రాష్ట్ర బీజేపీ నాయకులు అందె బాబయ్య మంగళవారం రూ.51వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయ కమిటీ సభ్యులు బాబయ్యను సన్మానించారు. దేవాలయ కమిటీ సభ్యులు దేపల్లి అశోక్‌గౌడ్, బంటారం సుదర్శన్‌గౌడ్, మెక్కొండ కుమార్‌గౌడ్, జంగయ్య గౌడ్, సి.కృష్ణ, శేఖర్, నారాయణ, నర్సింలు, శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు నియామక పత్రాలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు సమయాన్ని వృథా చేయకుండా వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా ఎదగాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే యాదయ్య అధ్యక్షతన మల్టీనేషనల్ కంపెనీ మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల కోసమే మెగా జాబ్‌మేళా నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. మహిళల అభివృద్ధి కోసం ప్ర భుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన మహిళలకు నియామక పత్రాలను అందజేశారు. ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, భీమయ్య, పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఫీజుల కోసం విద్యార్థులను వేధించవద్దు



మాట్లాడుతున్న నరేష్‌చారి

కొత్తూర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 21నుంచి పారంభమయ్యే పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఫీజుల వసూలు కోసం ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేయవద్దని ఏబీవీపీ మండల కన్వీనర్ కె.నరేష్‌చారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను వేదిస్తే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శివకుమార్‌చారి, సందీప్‌సింగ్, మురళీగౌడ్, జుగేష్, హర్షయాదవ్, రాజు, రాంజీ, ఉదయ్, అజిత్ తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



వినాయ్‌కుమార్, చంద్రకాంత్‌లను సన్మానిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ విద్యార్థులకు సూచించారు. మంగళవారం చేవెళ్లలోని ఆర్డీవో కార్యాలయంలో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో కలిసి కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణ, రమేశ్‌బాబు, తులస, ప్రణీత తదితరులు ఉన్నారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగంలో అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. ఆర్డీవో ఆఫీసులో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వినయ్ కుమార్ గ్రూప్-వన్ సర్వీస్‌లో రాష్ట్ర స్థాయిలో 483వ ర్యాంకు సాధించారు. అలాగే జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రకాంత్ గ్రూప్-2లో రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంకు సాధించాడు. వారిని ఆర్డీవో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.కృష్ణయ్య, డిప్యూ టీ తహసీల్దార్ రాజాశేఖర్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై

సీఎం మాట నిలుపుకోవాలి




తలకొండపల్లి : దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను చట్టబద్దంగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు షాద్‌నగర్‌లో చేపట్టిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నర్సింహ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీలో రాష్ట్ర సీఎం ప్రకటన చేశారని గుర్తు చేశారు. అప్పటి వరకు తెలంగాణలో ఉద్యోగ నియామకాలను చేపట్టవద్దని డిమాండ్ చేశారు. శ్రవణ్‌కుమార్‌మాదిగ, నాగభూషణం మాదిగ, సరేష్ మాదిగ, పాండు మాదిగ, వెంకటేష మాదిగ, రమేష్ మాదిగ, మహేందర్ మాదిగ, సుదర్శన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం చేస్తూ మాదిగలకు తీరని ద్రోహం తలపెడుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్దత కల్పించే వరకు గ్రూప్- 1,2,3లతో పాటు అన్ని పరీక్ష ఫలితాలు నిలివేయాలని తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని గట్టిప్పలపల్లి మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య ప్రారంభించారు. ఎంఎస్ఎఫ్ జిల్లా అధికారి ప్రతినిధి శ్రీకాంత్‌మాదిగ, మండలాధ్యక్షుడు తుడుం శ్రీను, వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు నారాయణ, జాన్‌వెస్లీ, మల్లేశ్, భీముడు, కృష్ణయ్య, శరత్, శామల కుమార్, తదితరులున్నారు.

యాచారం : ఎస్సీ వర్గీకరణ చేసేదాకా గ్రూప్ 1,2,3 ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు రి లేనినిరాహార దీక్షలు చేపట్టారు. మండలాధ్యక్షుడు ఎం.మహేష్ దీక్షలను ప్రారంభించి మాట్లాడుతూ తమకు న్యాయం చేసేదాక పోరాటం కొనసాగించి తీరుతామన్నారు. కొండల్, మస్కు నర్సింహ, సతీష్, లిం గం, యాదగిరి, బాలరాజ్ తదితరులున్నారు

కందుకూరు : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3లతో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఇతర ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు మండల కేంద్రంలో చేపట్టిన దీక్షలు రెండోరోజుకు చేసుకున్నాయి. మండల శాఖ అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు మాజీ జడ్పీటీసీ జె.పెద్ద రామయ్య పాల్గొని మాట్లాడారు. జి.జంగయ్య, మంద పాండు, పి.జంగయ్య, ఎ.కృష్ణ, టి.బాలయ్య, మ హిళ సింగర్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



యాచారం : దీక్షలో ఎమ్మార్పీఎస్ , ఎంఎస్ఎఫ్ నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



షాబాద్ : బహుమతులు అందజేస్తున్న యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు



షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతను సన్మానిస్తున్న ఆర్పీలు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధిని సాధించాలని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలు, మెప్మా సభ్యులను కమిషనర్ సన్మానించి, అభినందించారు. అలాగే వారు కమిషనర్ సునితను సన్మానించారు.

షాబాద్ : మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సూపరింటెండెంట్ రాములు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం షాబాద్ మండల పరిధిలోని చందన్‌వెల్లిలో మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, వెంకటయ్య, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మహిళల సాధికారిత, ఆర్థిక పురోగాభివృద్ధి, సమానత్వ సమాజ నిర్మాణానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీకేశవులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో కరుణశ్రీకేశవులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలువురు మహిళలను సత్కరించారు. మహిళా నాయకురాళ్లు సరిత, దర్శిని, సువర్ణ, భాగ్యలక్ష్మి, పాలాది లక్ష్మి, శ్రీదేవి, వరలక్ష్మి, అనంత లక్ష్మి, కోట అనిత, చెర్కు విజయ తదితరులున్నారు.



ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ కరుణశ్రీ కేశవులు తదితరులు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మంచాల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని, చెన్నారెడ్డిగూడలో తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శిరీష తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని, పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్, మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ పరమేష్‌లతో కలిసి తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

తుక్కుగూడ సెమినార్‌కు తరలిన సీపీఐ నాయకులు

చౌదరిగూడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా తుక్కుగూడలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సెమినార్‌కు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన సీపీఐ నాయకులు జిల్లా కార్యవర్గసభ్యుడు జంగయ్య ఆధ్వర్యంలో తరలివెళ్లారు. వెంకటేష్, కృష్ణ, నర్సింహ, లింగం, భీమయ్య, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


ఆమనగల్లు, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంటకగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. 6వ రోజు మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

తలకొండపల్లి : సమాజ శాంతి స్థాపనకు దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహద పడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చుక్కాపూర్ సమీపంలోని కల్కిదోన వేణుగోపాల స్వామి ఆలయాన్ని మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ పట్టాభి రామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తిలు శ్రీనివాస్‌రెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లో ఈనెల 20వరకు నిర్వహించే శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులకు మంగళవారం స్థానిక మాజీ సర్పంచ్ శ్రీశైలంకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కల్యాణంలో పాల్గొనాలని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలలాధ్యక్షుడు బీచ్యనాయక్‌లకు ఆయన ఆహ్వాన పత్రికలను అందజేశారు. రామకృష్ణ, బుచ్చయ్య, శ్రీను, కుమార్, తదితరులున్నారు.



ఆమనగల్లు : పూజల్లో భక్తులు